# మంగంపేట ముగ్గు రాయిలో మాయాజాలం!



### న- సంస్థకు భారీ నష్టం - ధరల్లో తేడా ఉన్నా అడిగేవారే లేరు

**రైల్వే కోడూరు, జూన్ 2 ప్రభాతవార్త** కడపజిల్లా నుండి తిరుపతి జిల్లాలో చేరిన రైల్వేకోడూరు మండలం మంగంపేట బెరైటీస్‌లో అంతా మాయాజాలంగా మారింది. ఇష్టానుసారంగా టెండర్లుదక్కించుకుని చివరకు సంస్థకు నష్టం వాటిల్లేలా పలు రకాల ధరలతో ముగ్గురాయి విక్రయాలు జరుగుతుండటంతో ఆయన వ్యాపార మతలబు ఏంటనేది అందరిలోనూ చర్చనీయాంశంగా తయారైంది. ఉత్పత్తి ఖర్చు టన్నుకు 2,350 రూపాయలువరకు ఖర్చుచేస్తుండగా విక్రయం మాత్రం టన్నుకు 1,180 రూపాయలుగా నిర్ణయించడం అంతుజిక్కని విషయంగా ఉంది. టన్ను ముగ్గురాయి ఉత్పత్తి తీసేందుకు సుమారు 2,350 రూపాయలులు ఖర్చు చేసి ఎంప్రద కంపెనీ కి అతి తక్కువ ధరకు 1,180 రూపాయలలకే విక్రయించి, మిగిలిన మిల్లుల యజమానులకు టన్ను సి. అండ్. డి. ముగ్గురాయిని 1,680 రూపాయలలకు విక్రయిస్తుండటంలో మాత్రం ఆంతర్యమేమిటని వ్యాపారులు అవాక్కువుతున్నారు. ఎంప్రద కంపెనీకి అతి తక్కువ ధరకు 60లక్షల టన్నులు బల్క్ గా దోచి పెట్టడమే కాకుండా, అమ్మిన రాయిని నిల్వ ఉంచి ప్రస్తుతం వెలికి తీస్తున్న ముగ్గురాయితో సంస్థకు సుమారు 20వేల కోట్ల రూపాయల నష్టం కల్గిస్తుండటంతో ఆ సంస్థకు, యాజమాన్యం కు మద్య జరుగుతున్న ఒప్పందం ఏమిటనేది అంతు బట్టడం లేదని మిల్లుల యజమానుల సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వర రావు, మిల్లుల యజమానులు గ్రామ పెద్దలు హరినాధ రెడ్డి, రమణ రెడ్డి, కార్మిక సంఘ్ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా వాళ్ళు సంస్థ తీసుకున్న దారుణ మైన నిర్ణయం పట్ల వారు ఆందోళన చెందారు.వ్యాపార రీత్యా ముగ్గురాయి కోసం కొంతమంది అధికారుల ప్రేక్షకపాత్రతోమంగంపేటకు వచ్చి ఇక్కడున్న మిల్లుల యజమానులతో కలిసి వ్యాపారం చేయాల్సింది పోయి ఐక్యంగా ఉన్న వారి మధ్య విభేదాలు పెట్టి మూడు ముక్కలు చేయడంలో వ్యాపార వ్యధ అంతు బట్టడం లేదన్నారు.ఇటీవల బైరైటీస్ కార్యాలయంవద్ద ధర్నా చేసిన నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ముగ్గురాయి ఉన్న ధరకంటే 500 రూపాయలలకు తక్కువ కొనుగోలు చేయడమే కాకుండా అదేవిధంగా ధరలు పెట్టి కాసులు ఎర చూపి మామధ్యే వివాధాలకు పురిగొలప డంలో ఎంప్రదకున్న వ్యధ కక్ష సాధింపు చర్య ఏమిటో అంతు బట్టడం లేదన్నారు. ముగ్గురాయి బల్క్ టెండర్ పేరుతో తక్కువ ధరకు దోచుకుని, మద్దతు పలికేందుకు గుత్తుగా ఏమేరకు విక్రయిస్తున్నారనేది అధికారుల తనిఖీల్లో తేలాల్సి ఉంది. ఆ కంపెనీ అవినీతి పట్ల విజిలెన్స్ కమిటీ కి ఎం. ఎల్. సి. రాంభూపాల్ రెడ్డి విజిలెన్స్ కు లేఖరాయడం జరిగిందన్నారు. గనులు శాఖ మంత్రి కూడా జరిగిన అవినీతి 20వేల కోట్ల నష్టాన్ని గురించి అసెంబ్లీ లో ప్రస్తావించడం జరిగిందన్నారు. సంస్థ అభివృద్ధి అయితే మాకు అన్నివిధాలా బాగుంటుందని యావత్ ఆస్తులు ఇచ్చి సంస్థ అభివృద్ధికి పాటుపడితే మమ్మలను కాదని ఎంప్రదా సంస్థకు ఉన్న సరుకును అత్యంత తక్కువ ధరకు విక్రయించి కార్పొరేషన్ కు గండి కొట్టడంలో ఆంతర్యంవెలుగులోకి రావాలని డిమాండ్ చేశారు.

# రఘువీరా, షర్మిలలో 'రాజ్యసభ' ఎవరికి?

### కర్ణాటకలో సీటు కోసం ఇద్దరి మధ్య పోటీ

**అనంతపురం, జూన్ 2, (ప్రభాతవార్త బ్యూరో)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కీలక కాంగ్రెస్ నేతలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల, సిడబ్ల్యుసి సభ్యుడు నీలకంతాపురం రఘువీరారెడ్డి ల పేర్లు రాజ్యసభ స్థానాల సీట్ల విషయంలో కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా చర్చ జరుగుతోంది. కర్ణాటక రాష్ట్రంలో ఖాళీ పడే రాజ్యసభ స్థానాల్లో ఆంధ్ర కాంగ్రెస్ నేతలకు ఒకటి ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వైయస్ షర్మిల ఇటీవల కాంగ్రెస్ అగ్రనేతలను కలవడంతో రాజ్యసభ సీటు షర్మిలకు ఇచ్చే అవకాశం ఉందని సోషల్ మీడియాలో బలంగా ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఇటు ఆంధ్రాలోను, కర్ణాటకలోనూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలకు గుర్తింపుగా సిడబ్ల్యుసి సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి పేరు కూడా కాంగ్రెస్ అధిష్టానం వర్గం పరిశీలిస్తున్నట్లు తెలియ వచ్చింది. కాంగ్రెస్ అగ్ర నేతలతో రఘువీరారెడ్డి కి ఉన్న సంబంధాలను కాంగ్రెస్ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా వైయస్ షర్మిల పేరును ప్రతిపాదించే అవకాశం లేకపోలేదని కూడా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో కర్ణాటకలో ఖాళీ పడే రాజ్యసభ స్థానాల్లో వైయస్ షర్మిల, ఎన్.రఘువీరారెడ్డికి అవకాశం ఇస్తారా లేదా అన్నది కొద్దిరోజుల్లో తేరే అవకాశం ఉంది. కర్ణాటకలో డి .కే శివకుమార్ నేతృత్వంలో క్యాబినెట్ కూర్పు పూర్తి అయిన తర్వాత ఈ విషయం చర్చకు వచ్చే అవకాశం ఉంది. కర్ణాటకలో కూడా పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజ్యసభ స్థానాలకు రేసులో ఉండడం, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య లేదా ఆయన సతీమణికి రాజ్యసభ స్థానం ఇవ్వాలని ప్రతిపాదన కూడా కాంగ్రెస్ అధిష్టానం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర కాంగ్రెస్ అగ్ర నేతలకు రాజ్యసభ సీట్లు ఎవరికి వస్తాయి? పార్టీ అధిష్టాన వర్గం ఎవరి వైపు ముగ్గు చూపుతుందని ఆసక్తికరంగా ఉంది.దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో రాజకీయ సమీకరణలు ఆసక్తిగా మారాయి. 2024 శాసనసభ లోక్సభ ఎన్నికలకు ముందు ఏపీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే బాధ్యతను భుజాన వేసుకున్న వైఎస్ షర్మిల, ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లను కలిశారు. గతంలో ఆమె కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేసిన సమయంలో, అధిష్ఠానం ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఏపీలో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేల బలం లేకపోవడంతో, కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున అక్కడి నుండి ఆమెను ఎగువ సభకు పంపాలని షర్మిల కోరుతున్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఉన్న మంచి సంబంధాలు కూడసంబంధాలు కలిసివచ్చే అంశంగా కనిపిస్తోంది. మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి పేరు కూడా కర్ణాటక కోటా రేసులోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నో ఏళ్లు పనిచేసే 2014, 2019 ఎన్నికలను కూడా పార్టీ తరఫున నిర్వహించారు. కర్ణాటక సరిహద్దులో సత్యసాయి జిల్లా మలచిన ప్రాంతానికి చెందిన రఘువీరారెడ్డి గత ఎన్నికల సమయంలో కర్ణాటకలో పలు జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసారు.

# ఈత సరదా.. యువకుడి ప్రాణం తీసింది

### మృతదేహం కోసం గాలింపు

**కార్వేటినగరం,జూన్ 2 ప్రభాతవార్త:** వేసవి తాపాన్ని తీర్చుకోవడం కోసం ముగ్గురు పిల్లలు చెరువులో ఈతకు వెళ్ళి ఓ యువకుడు గల్లంతై మృతిచెందిన సంఘటన తిరుపతి జిల్లా కార్వేటినగరంలో మంగళవారం చోటు చేసుకుంది. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వినాయకపురం రోడ్డు,ముదు ్దకృష్ణాపురంకు చెందిన చింటూ,మధు,ముని(17)మంగళవారం మధ్యాహ్నం ఈత సరదాకోసం నందిమంగళం కొత్త చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్ళారు. వీరిలో మునికి ఈత రాకపోవడంతో చెరువు లోకి దిగిన కొద్దిసేపటికే నీటిలో గల్లంతైనట్లు సమాచారం. అయితే కూడా వెళ్ళిన చింటూ, మధు చెరువు వద్ద జరిగిన విషయాన్ని వెంటనే కుటుంబసభ్యులకు తెలియజేయకుండా తిరిగి గ్రామానికి వచ్చేసినట్లు సమాచారం. చీకటి పడుతున్నా ముని ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరా తీయగా చెరువులో గల్లంతయిన విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తుంది.పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ కానరానట్లు తెలుస్తుంది.ముద్దుకృష్ణాపురంకు చెందిన బి.మాధవి,బి.మునీంద్రా దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. గల్లంతైన బండారు ముని 8వ తరగతి వరకు చదువుకున్నాడు. చదువు అర్థాంతరంగా ఆపి వేసి పుత్తూరు పట్టణంలోని ఓ నూనె వ్యాపారి దగ్గర డెలివరీబాయిగా జీవనం సాగిస్తున్నారు. ఏడాది క్రితం తండ్రి బండారు మునీంద్ర అనారోగ్యంతో మృతిచెందాడు.తల్లి మాధవి ఓ వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుంది.ఎంత గాలించినా బండారు ముని ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబసభ్యులు,బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. కార్వేటినగరం ఎస్.ఐ.తేజస్విని, పోలీసులబృందం గాలింపు చర్యలు చేపట్టారు.


# ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ఫుల్ స్టాప్

### - జిల్లాల్లో పరిష్కారం కాని ఇళ్ల సమస్యలను కేబినెట్‌కు తీసుకురండి - ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడజూన్ 2, ప్రభాతవార్తప్రతినిధి:**జిల్లాల్లో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లా స్థాయిలో ఎంత వరకు చేయగలరో చేయాలని... జిల్లా స్థాయిలో క్రమబద్దీకరణ కుదరన పక్షంలో కెబినెట్‌కు తీసుకు రావాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. మంగళవాం ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మట్లాడుతూ..."రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణ సమస్య చాలా కాలంగా పెండింగులో ఉంది. ఏదో ఒక రకమైన సాకు చూపి వాటిని పెండింగులో పెట్టేస్తు న్నారు. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాలి. ప్రతీ జిల్లాలో క్రమబద్దీకరించాల్సి న ఇళ్లు, ఇళ్ల స్థలాల జాబితాను సిద్దం చేయాలి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోండి. క్రమబద్దీకరణకు సంబంధించి జిల్లాల స్థాయిలో ఎంత వరకు చేయగలిగితే... ఆ మేరకు చేసే యాలి. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే... కేబినెట్లో పెట్టి వాటి క్రమబద్దీకరణకు నిర్ణయం తీసుకుంటాం. ఎటువంటి వివాదాల్లేకుండా క్రమబద్దీకరించ దగ్గ స్థలాలను ప్రతీ కేబినెట్టుకు తీసుకురావాలి. అప్పటికీ పూర్తి కానివి ఏమైనా ఉంటే... ఆ సమస్యను ఏ విధంగా పరిష్కారిం చాలో ఆలోచన చేద్దాం. ఇక గృహ నిర్మాణ శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టాలి. ఈ మేరకు గృహ నిర్మాణంఆర్థిక శాఖలు సమన్వయం చేసు కోవాలి." అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. .రాజవొమ్మంగి సీడీపీఓ ఆత్మహత్య కారకులపై కఠిన చర్యలు ఇసుక అక్రమాలు అస్స లు జరగడానికి వీల్లేదు. ఏపీలో తవ్విన ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. రాష్ట్రాల సరిహద్దులు దాటిన వాహనాలను సీజ్ చేయండి.. ఈ విషయంలో కఠినంగా ఉండండి. ఇసుక లారీ లను ట్రాకింగ్ పెట్టాలి. ఈ మేరకు టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగిం చుకోవాలి. ఇసుక అక్రమంగా వేరే ప్రాంతాలకు వెళ్తే... వెంటనే అలెర్ట్ మెసేజెస్ వచ్చేలా మెకా నిజం ఉండాలి. ఇప్పటికే 50 వేల వాహనాలకు జీపీఎస్ పెట్టి ట్రాకింగ్ చేస్తున్నాం.. అక్రమాలు జరగడానికి వీల్లేదు. ఈ మేరకు మైనింగ్‌పోలీసులు కో ఆర్డినేట్ చేసుకోవాలి. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం, అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కలిగితే.. ప్రభుత్వం అందించే సేవలకు సార్ధకత లభిస్తుంది. ప్రజల్లోకి వెళ్లాలని... ప్రజలకు వివరించాలని చెప్పేది ప్రచారం కోసం కాదు... ప్రజలకు అవగాహన కల్పించడానికే అనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసు కోవాలి. ప్రభుత్వ సేవల పట్ల అవగాహన కలిగి తే... ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి పెరుగుతుంది.

# ఇంద్రకీలాద్రిలో వైభవంగా సరస్వతి యాగం

**ఇంద్రకీలాద్రి, జూన్ 2, ప్రభాతవార్త :**మూల నక్షత్రము సందర్భముగా పాత ఛండీ హోమ యాగశాల నందు వైదిక కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ ముఖ్య అర్చకులు శ్రీ యజ్ఞ నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సరస్వతి యాగం జరిగినది. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులందరు విద్యలలో రాణించాలని సంకల్పం చెప్పి సరస్వతి యాగం వద్ద విశేష పూజలు నిర్వహించడం జరిగింది పెనమలూరుకు చెందిన కిలారు రామ్మోహనరావు గారు వారి భార్య కీ.శే.కిలారు విశాలక్షి ్మ జ్ఞాపకార్థం ఉచిత ప్రసాదము పంపిణీ నిమిత్తం రూ.1,25,000లు, శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయము అభివృద్ధి నిమిత్తం రూ.50,000లు, గో సంరక్షణకు రూ.50,000లు చొప్పున మొత్తం సొమ్ము రూ.2,25,000లు విరాళాలను ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)కి అందచేయగా, వేద పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదం అమ్మవారి చిత్రపటం అందచేశారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా 1టౌన్ బిజెపి నాయకులు ఎ.శ్రీరామ్ మరియు శ్రీధర్ మరియు దుర్గగుడి ట్రస్ట్ బోర్డు సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే సుజనా చౌదరి సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ నిర్వహించిన ప్రత్యేక పూజలు అనంతరం ప్రస్తుతం ఉన్న తీవ్రమైన ఎండల దృష్ట్యా ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులు ఎండదెబ్బకు గురికాకుండా సురక్షితంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక గొడుగులను ఏర్పాటు చేశారు. దుర్గగుడి డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్‌ను కలసి భక్తుల సౌకర్యార్థం ఈ గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక బీజేపీ నాయకులు ఏ శ్రీరామ్ మరియు శ్రీధర్ ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అవ్వారు శ్రీనివాస్ మరియు భక్తులు పాల్గొన్నారు.



గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, వైవిధ్యభరిత చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫౌజీ చిత్ర దర్శకుడు హను రాఘవపూడి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ స్వామి అమ్మవార్లను మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయార్చకులు వేదాశీర్వచనం అందించారు.

# అమరావతిలో ఎపిఐసి ల్యాబ్స్‌ఏర్పాటుకు అవగాహన ఒప్పందం

**అనంతపురం, జూన్ 2 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్రప్రదేశ్ యొక్క ఆవిష్కరణ, తయారీ పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్), కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌టిఐహెచ్ అమరావతి హబ్‌లో అడ్వాన్స్‌డ్ ప్రోటోటైపింగ్, ఇన్నోవేషన్ సెంటర్ (ఏపిఐసి ల్యాబ్స్)ను స్థాపించడానికి ఒక అవగాహన ఒప్పందం చేసుకుని వాటిపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిఐహెచ్ గ్రూప్ సీఈఓ, ఐఏఎస్ అధికారిణి ధాత్రి రెడ్డి, కియా ఇండియా నుండి ముఖ్య పరిపాలనా అధికారి టే హ్యూన్ కిమ్; లీగల్, కంప్లయన్స్, కార్పొరేట్ అఫైర్స్, సిఎస్ఆర్ పిఆర్ విభాగపు సీనియర్ సలహాదారు జుంగో ఆన్, కియా ఇండియా ప్రిన్సిపల్ అడ్వైజర్ డా.టి.సోమశేఖర రెడ్డి సహా సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. ఆధునిక తయారీ, పారిశ్రామిక నైపుణ్యంతో ఒక పటిష్టమైన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను సృష్టించాలనే ఆర్‌టిఐహెచ్ అన్వేషణలో కియా ఇండియాతో ఈ భాగస్వామ్యం తదుపరి పెద్ద ముందడుగు కాబోతోందన్నారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటీ టెక్నాలజీస్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఇతర డీప్‌టెక్ రంగాల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఆవిష్కరణలను వేగవంతం చేస్తుందన్నారు. కియా ఇండియా గురించి ఏప్రిల్ 2017లో, అనంతపురం జిల్లాలో ఒక కొత్త తయారీ కేంద్రాన్ని నిర్మించడానికి కియా ఇండియా, భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కియా ఆగస్టు 2019లో భారీ ఉత్పత్తిని ప్రారంభించింది మరియు 3,00,000 యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఏప్రిల్ 2021లో, కియా ఇండియా తన కొత్త బ్రాండ్ గుర్తింపు "మూవ్‌మెంట్ దట్ ఇన్‌స్పైర్స్" కు అనుగుణంగా తనను తాను పునఃరూపకల్పన చేసుకుంది. వినూత్న ఉత్పత్తులు, సేవల మద్దతుతో వినియోగదారులకు అర్థవంతమైన అనుభవాలను అందించడమే దీని లక్ష్యం. ఈ కొత్త బ్రాండ్ గుర్తింపు కింద, కియా కొత్త ప్రమాణాలను సాధించడానికి, వినియోగదారులను మరింతగా ఎదగడానికి, మరింతగా సాధించడానికి



ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న దృశ్యం

ప్రేరేపించడానికి మార్గాలను అన్వేషిస్తోంది. కియా ఇండియా తన అనంతపూర్ ప్లాంట్ నుండి దాదాపు 15 లక్షల వాహనాలను పంపిణీ చేసింది, ఇందులో 12 లక్షలకు పైగా దేశీయ అమ్మకాలు, 367 లక్షలకు పైగా ఎగుమతులు ఉన్నాయి. భారతీయ రహదారులపై 49.5 లక్షలకు పైగా కనెక్టెడ్ కార్లతో, ఇది దేశంలోని కనెక్టెడ్ కార్ల అగ్రగాములలో ఒకటిగా నిలిచింది. ఈ బ్రాండ్ 370 నగరాల్లో 819 టచ్‌పాయింట్‌లతో విస్తృతమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉంది మరియు దీనిని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది.

# గుట్టు చప్పుడు కాకుండా గట్టు చాటున గూడుపుఠాణి!

### - కంకర బ్లాస్టింగ్ చేసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ !

**జగ్గయ్యపేట, జూన్ 2, ప్రభాతవార్త :** అధికారుల, పాలకుల అనుగ్రహం ఉంటే చాలు చట్టపరిధి లోని నిబంధనలు కూడా నీటిమీది రాతల్లా మారిపోతాయని ప్రభుత్వ యంత్రాంగం నిరూపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకపక్క అటవీ భూములు, మరోపక్క జాతీయ రహదారికి సమీపంలో కంకర బ్లాస్టింగ్ యూనిట్ ఏర్పాటుచేసుకునేందుకు ఒక కంపెనీకి అనుమతులిచ్చే క్రమంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ పర్యావరణ శాఖ సమావేశాన్ని మంగళవారం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని కొంగరమల్లయ్య గట్టు వెనుక భాగంలో అధికారులు నిర్వ హించారు. సమీప గ్రామస్తులకు, మీడియాకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా సమావేశాన్ని నిర్వ హించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడికి సమీపంలోఎని ధర్మవరప్పాడుతండ గ్రామ ప్రనజలు అనేకసార్లు భారీ పేలుళ్ళ గురించి ఫిర్యాదుల చేసినా అవి ఇంతవరకు విచారణ రాకపోగా బుట్టదాఖలు చేశారని విమర్శి స్తున్నారు. పశుపక్షాదులు, ప్రజలు, జంతువులు భారీ శబ్దాలతో ఇబ్బందులు పడటంతోపాటు ధూళి వ్యాపించే పరిస్థితుల్లో ఆరోగ్యం, పంటలపై కాలుష్య ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నా ప్రజాభిప్రాయసేకరణ సభలో అనుకూల వాదుల ప్రసంగాలను నమోదుచేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రధా నంగా బ్లాస్టింగ్‌కు బఫర్‌జోన్ నిబంధనలు వర్తించవా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయించిన స్థలానికి అతి సమీ పంలో అటవీ భూములు, జాతీయ రహదారి 65 ఉండగా వీటి సమస్యలను అధికారులు పరిగణలోకి తీసుకునే అంశాలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. భరించశక్యం కాని బ్లాస్టింగ్ శబ్దాలకు అటవీ వన్యప్రాణులు, పశులకు హాని కలుగుతుందనే ప్రాథమిక విషయంలో కూడా స్పష్టత లేకుండా పోయిందనే అరోపణలు ఉన్నాయి.

జీవకోటికి నష్టంవాటిల్లే పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కంపెనీకి అనుమతులిచ్చే విషయంలో పున!పరిశీలన చేయాలని లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాటం చేయాల్సి వస్తుందని పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్తలు, గ్రామీణ ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తిచేశారు.

కాగా సమావేశానికి నందిగామ ఆర్‌డిఓ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఏడి శ్రీనివా ాస రావు, స్థానిక తహసీల్దార్ పెద్ది మనోహర్ హాజరయ్యారు.

# సిడబ్ల్యుసిలోకి సిద్ధరామయ్య

### నేడు కన్నడ సీఎంగా డికె ప్రమాణం, డిప్యూటీగా పరమేశ్వర ఒక్కరికే ఛాన్స్

**బెంగళూరు, జూన్ 2:** సీఎం పదవినుంచి వైదొలిగి తన డిప్యూటీ డికెశివకుమార్‌కు అవకాశం కల్పించిన కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్యకు కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలిలో పదవినిచ్చింది. కాంగ్రెస్ వర్కింగ్‌క మిటీలో ఆయన్ను నియమిస్తున్నట్లు ప్రకటిం చింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణు గోపాల్ ఈమేరకు అధికారికంగా ప్రకటించారు. పార్టీకి సంస్థాగతంగాను, రాజకీయ వ్యూహాలపై దిశా నిర్దేశంచేసే అత్యున్నత నిర్ణాయక కమిటీ వర్కింగ్‌కమిటీలో సిద్ధరామయ్య వంటి సీనియర్లు ఉండాలని హైకమాండ్ భావించిందని కెసివి తెలిపారు. అలాగే జాతీయ, రాష్ట్ర నాయకత్వా లమధ్య సమన్వయం కోసమే కర్ణాటకలో పార్టీ, ప్రభుత్వ సమన్వయం చేసుకునేందుకు ఈని



యమాకం జరిగిందని హైక మాండ్‌ప్రకటించింది. సిద్ధరామయ్యను సిడబ్ల్యుసిలోకి తీసుకురావ డంద్వారా పార్టీని కర్ణాటకలో సంస్థాగతంగా ప్రక్షాళనచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనియామకంతో ఇక సిద్ధరామయ్య జాతీయ స్థాయి పార్టీ క్రియాశీలక నేతగా వ్యవహరిస్తారు.

**నేడు సీఎంగా డికె ప్రమాణం:** ఇదిలా ఉంటే బుధవారం రాష్ట్ర సీఎంగా ప్రస్తుత డిప్యూటీ డికె శివకుమార్‌ప్రమాణం చేయనున్నారు. ఆయనచేత రామ్‌దాస్ అథవాలే ప్రమాణంచేయిస్తారు. శివకు మార్‌తోపాటే మరో పదిమందివరకూ కేబినెట మంత్రులు ప్రమాణం చేస్తారని చెపుతున్నారు. ఇప్పటికే ఎఐసిసి, పార్టీ అంతర్గత వ్యవహారాల విభాగం మంత్రుల పేర్లను ఖరారుచేసిందని తెలు స్తోంది. వీరిలో సీనియర్ మంత్రి సిద్ధరామయ్య కేబినెట్‌లో కూడా పనిచేసిన దళితనేత జికెప రమేశ్వరకు డిప్యూటీసీఎం పదవి వరిస్తోందన్న ప్రచారం ఊపందుకుంది. నలుగురు డిప్యూటీలు ఉండాలన్న డిమాండ్‌ను డికె నిష్కర్షగా తిరస్క రించిన సంగతి తెలిసిందే. దీనితో దళితనేత సీనియర్‌నాయకుడు పరమేశ్వరను డిప్యూటీగా ఎంపికచేసిందని తెలుస్తోంది.

# దేశ ఆర్థిక వ్యవస్థ బలో పేతానికి బంగారాన్ని రీసైకిల్ చేయండి

### ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు



**న్యూఢిల్లీ, జూన్ 2:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచిం చారు. ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్స హిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9శాతం స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది. పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను పరిశ్రమ నిపు ణులు సమర్థిస్తున్నారు. జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. దిగుమతి చేసు కునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# డైలాగులు కొట్టిన పవన్ కల్యాణ్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** త్రివిక్రమ్ రాసి ఇచ్చిన డైలాగులను పవన్ కళ్యాణ్ చదివారని కాంగ్రెస్ ఎంఎల్ఎ అనిరుధ్ రెడ్డి విమర్శించారు. పట్టా శిఖం భూములను ముట్టుకోరాదన్నారు. ఎపిలో నిలబడుతావా? తెలంగాణలో నిలబడుతావా ? మీ ఇష్టం అని అన్నారు. పవన్ ఎవరి కోసం తెలంగాణకు వచ్చారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ కోసం వచ్చారా? బిజెపి కోసం వచ్చారా? అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పెట్రోల్ రేట్లపై పవన్ కళ్యాణ్ కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. ఆంధ్రాలో దిక్కు లేదు.. గతంలో ఒక్క సీటు రాలేదు డిపాజిట్ గల్లంతైందని, ఇప్పుడు టిడిపి, బిజెపి పొత్తు ఉండడం వల్లే జనసేన గట్టెక్కిందని ఆయన తెలిపారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని, తెలంగాణకు వచ్చి ఎలా అవుతానని పవన్ కళ్యాణ్ స్వయంగా అన్నారని ఆయన గుర్తు చేశారు. మరణించిన గద్దర్ గురించి మాట్లాడుతూ.. తానే కారు కొనిచ్చా అని చెప్పుకోవడం భావ్యం కాదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు గెలికి నవ నిర్మాణ సభ పెట్టాలని ప్రయత్నిస్తే తాము ఎలా అంగీకరిస్తామని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ గుజరాత్‌లో పార్టీ పెట్టుకోవాలని ఎంఎల్ఎ అనిరుధ్ రెడ్డి సూచించారు. వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే పవన్ ఆయనకే మద్దతు ఇస్తారని విమర్శించారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ కలవడమే కలిసి వచ్చిందన్నారు. లోగడ నర దిష్టి గురించి మాట్లాడిన పవన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణచెప్పాలన్నారు.

